క్లుప్తంగా

నేటి నుంచి క్రీడా పోటీలు

గట్టు: వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, పోటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు పోలీస్‌స్టేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్ఐ కోరారు.

ఎర్రవల్లిచౌరస్తా: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 9 వరకు క్రీడా పోటీలను నిర్వహిస్తునట్లు ఎస్సై గోకారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సెల్: 9440795747, 9581857285 లను సంప్రదించాలని కోరారు.

ఈ నెల 12న..

ఉండవెల్లి: ఈ నెల 12న వివేకానంద జయంతి సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్, 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దీర్ఘకాలిక రోగాలపై పరీక్షలు తప్పనిసరి

మానవపాడు: దీర్ఘకాలిక రోగాలపై పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలని డాక్టర్ రిజ్వాన్ తాన్విర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాలలో నిరంతరం వివిధ రోగాలపై పరీక్షలు చేయాలని సూచించారు. గర్భిణులకు, బాలింతలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యానారాయణ, చంద్రన్న, సంధ్యారాణి, ఫార్మాసిస్ట్ తిరుమల్ రావు, ఏఎన్ఎలు, ఆశలు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్ దిన్నె చెందిన బీఆర్ఎస్ నాయకులు సర్వేశ్వర్ రెడ్డి, తోట వెంకటేష్‌ల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని కర్నూల్ జిల్లాలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. చల్లాను కలిసిన వారిలో నాగేష్, మధు, నరసింహుడు, లక్ష్మన్న, మహేష్‌లు ఉన్నారు.

మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ

మానవపాడు: నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటునట్లు ఎంపీడీఓ రమణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధిహమీలో పని చేస్తున్న వర్కర్లకు ఆన్‌లైన్ అటెండెన్స్ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, ఈసీ లాల్‌నాయక్ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి మాధవ స్వామి జాతర

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డిలో మాధవ స్వామి జాతర ఈ నెల 14 వతేదీ నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. 14న ప్రభోత్సవం, 15న కల్యాణోత్సవం, రథోత్సవం, 16న పారు సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జాతర పురస్కరించుకుని గ్రామంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు, కబడ్డీ, క్రికెట్ ప్రీమియర్ లీగ్, రంగవల్లుల పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బట్టతల బాధితుల సంఘం ఎన్నిక



శాంతినగర్: బట్టతల బాధితులను ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు పైపాడు భాస్కర్ అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో శుక్రవారం బట్టతల బాధితుల సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా తిప్పన్న ప్రధాన కార్యదర్శిగా తోట వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ చాలామంది బట్టతలతో అవమానాలను ఎదుర్కొంటూ మానసికంగా కుంగిపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి బట్టతల బాధితులకు నెలకు రూ.6 వేల చొప్పున పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషి

రాజోళి: విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషి చేస్తామని ఉప సర్పంచ్ గోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలోని పాఠశాలల పనితీరుపై చర్చించారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల కో ఆర్డినేటర్ హనిమి రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్‌లు యూసుఫ్, తిరుమలేష్, వీరేష్, వీరస్వామి, సుధాకర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీలకే 'పవర్'

- పుంజుకోనున్న పల్లెల ప్రగతి
- గ్రామసభల ఆమోదంతో నిధుల వినియోగం
- జీవో 91తో కొనసాగుతున్న అభివృద్ధి పనులు



కోదండాపురం గ్రామ పంచాయతీ

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి పకడ్బందీగా చర్యలు చేపట్టింది. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం భావించి నిధుల వినియోగంలో పల్లెలకే అధికారం ఇచ్చింది. ఎటువంటి కొర్రీలు లేకుండానే పంచాయతీలకే పూర్తి స్వేచ్ఛనిచ్చింది. దీంతో పల్లెలు ప్రగతిలో పరుగులు పెట్టనున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 91తో గ్రామాలకు ఊరట లభించింది. అత్యవసర సమయంలో అభివృద్ధి పనులకు ఆటంకాలు తొలగాయి. గతంలో గ్రామ పంచాయతీలలో ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. పనులు నత్తనడకన జరిగేవి. ఉన్నతాధికారుల నుంచి సకాలంలో అనుమతులు లభించక అత్యవసర పనులు కూడా నిర్వహించలేని దుస్థితి ఉండేది. దీంతో పల్లెల్లో అత్యవసరమైన పనులు ఉన్నా చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు తరుచుగా ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ విధానానికి ప్రభుత్వ స్వస్తి పలికింది.

గ్రామసభల ఆమోదంతో నిధులు ఖర్చు..

అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలు ఉన్నాఇ. మొత్తం 137 గ్రామాల్లో అత్యవసర పనుల అభివృద్ధికి గ్రామసభల ద్వారా నిధులను వెచ్చించనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 91తో ప్రస్తుతం గ్రామాలలో అభివృద్ధి పనులు పుంజుకుంటున్నారు. ఎలాంటి ఆటంకం లేకుండానే పనులు వేగంగా ముందుకు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని 13 అనుబంధ గ్రామాల్లో గతంలో కుంటిపడ్డ పనులు జీవో ద్వారా వేగంగా ముందుకు సాగుతున్నాయి. జనాభా ప్రతిపాదికన ఆర్థిక సంఘం ఎస్ఎఫ్‌సీ నిధులను అందజేస్తోంది. కొత్త జీవో విడుదలతో పల్లెల్లో పనులు వేగంగా జరగటంతో ప్రజలు, సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ముందుగా డీఎల్‌పీఓల ద్వారా డీపీఓ, కలెక్టర్ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించేవారు. రూ. లక్షలోపు నిధులు జిల్లా పంచాయతీ అధికారికి, రూ. 3 లక్షల పైన ఖర్చుల ఆమోదం కోసం కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా అవసరమయ్యేది. దీంతో పల్లెల్లో అత్యవసర పనులను ఎంతగానో జాప్యం జరిగేది. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 91 ద్వారా పల్లెల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అత్యవసర పనులను గ్రామసభల ద్వారా నిధులను తీర్మానం చేసుకొని పనులను వెంటనే చేపట్టవచ్చును.

నియోజకవర్గంలోని ఆయా మండలాల వారీగా పంచాయతీల వివరాలు..

మండలం	గ్రామాలు	జీపీలు	అనుబంధ గ్రామాలు
ఇటిక్యాల	35	29	06
మానవపాడు	17	16	01
అలంపూర్	15	14	01
ఉండవెల్లి	16	16	00
రాజోలి	13	11	02
అయిజ	31	28	03
వడ్డేపల్లి	10	10	00

జీవో 91 జారీతో ప్రయోజనాలు

- ప్రభుత్వం జారీ చేసిన కొత్త జీవో 91 ప్రకారం గ్రామాల్లో పనులను వెంటనే చేపట్టవచ్చు.
- గ్రామంలోని పనులను గుర్తించి గ్రామసభ ద్వారా తీర్మాణం చేసి ఆమోదం పొందిన వెంటనే నేరుగా నిధులను ఖర్చు చేసువచ్చు.
- ఉన్నతాధికారుల అనుమతులు అవసరంలేదు.
- దీని ప్రకారం గ్రామంలో తలెత్తే నీటి ఎద్దడి, పల్లె ప్రగతి పనులు, మురుగు కాల్వల నిర్మాణాలు, రోడ్లకు మరమ్మతు చేయడం వంటి పనులకు వెసులుబాటును కల్పించారు.

కొత్త జీవోతో జీపీలకు ఊరట..



ప్రభుత్వం ఇటీవలె జీవో నెంబర్ 91ని జారీ చేయడం వల్ల పల్లె ప్రజలకు, సర్పంచ్‌లకు ఎంతగానో ఊరట లభించింది. గతంలో జీపీలో నిధులున్నా వాటిని అత్యవసర పనులకు ఖర్చు చేయడానికి ఎన్నో అడ్డంకులుండేవి. ముందుగా ఉన్నతాధికారులైన డీఎల్‌పీవో, కలెక్టర్ అనుమతి రావడానికి కూడా చాలా సమయం పట్టేది. ఎవరైనా చిన్న అభ్యంతరం తెలిపినా వాటిని ఉన్నతాధికారులు వెంటనే నిలిపివేసేవారు.

– జోగుల రవి, సర్పంచ్, ఎర్రవల్లి పంచాయతీ

నిబంధనల మేరకు ఖర్చు చేయాలి



ప్రభుత్వం విడుదల చేసిన కొత్త జీవో ప్రకారం పంచాయతీలలో పనులను చేపట్టేందుకు గ్రామసభల ద్వారా ముందుగా ఆమోదం తెలుపుకోవాలి. దాని తర్వాత నేరుగా అభివృద్ధి పనులకు ఎంత నిధులు కావాలో గ్రామస్తులందరి సమక్షంలో తీర్మానించి నిధులను వెచ్చించకోవచ్చు. పల్లెల్లో చేపట్టే ఆయా అభివృద్ధి పనులను సర్పంచ్‌లు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే పంచాయతీ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

కల్యాణం.. కమనీయం



అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వేంకటేశ్వర కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. శాస్త్రోక్తంగా వేదమంత్రాలు పఠిస్తూ స్వామివారి కల్యాణ తంతును జరిపించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. మేళతాళాలతో, మంగళ వాయిద్యాలతో స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఎన్నికలపై దిశానిర్దేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ కార్యకర్తలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి హాజరై అసెంబ్లీ ఎన్నికలపై నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, తిమ్మారెడ్డి, అబ్దుల్లా, శంకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రాజేష్, జనార్దన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించండి

శాంతినగర్: హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో జెడ్పీటీసీ కాశపోగు రాజు, బీఆర్ఎస్ నాయకులు రవిరెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కన్వీనర్ ప్రకాష్‌లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామాల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని విన్నవించారు.

పేదల కోసమే కంటి వెలుగు



రాజోళిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

రాజోళి: పేదల కోసమే కంటి వెలుగును సీఎం కేసీఆర్ ప్రారంభించారని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఈ నెల 18 నుంచి చేపట్టబోయే కంటి వెలుగు కార్యక్రమంపై ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. అధికారులు పకడ్బందీగా కంటివెలుగు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, ఎంపీడీఓ గోవిందు రావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గద్వాల రూరల్/గట్టు/ ధరూరు: జిల్లా కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవన్, గట్టు మండల కేంద్రంలోని రైతు వేదిక, ధరూరులోని రైతువేదికలో శుక్రవారం రెండో విడత కంటి వెలుగుపై నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలంపూర్ రూరల్: పట్టణంలో కంటి వెలుగుపై ఎంపీపీ బేగం అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, వైద్యాధికారి ప్రసూనరాణి, వైస్ ఎంపీపీ అనూరాధ, మండల ఆరోగ్యవిస్తరణాధికారి లక్ష్మీకాంత్, ఏపీఎం పారిజాతం పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కంటి వెలుగుపై నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులకు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, వైద్యులు మౌనిక, ఎంపీడీఓ రమణరావు, వైస్ ఎంపీపీ దేవన్న, మండల సూపర్‌వైజర్ ఆస్మా, ఎంపీఓ పద్మావతి, ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ సాయిప్రకాష్ అధ్యక్షతన కంటివెలుగుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విష్ణు, ఎంపీఓ నరసింహారెడ్డి, పీహెచ్‌సీ వైద్య బృందం, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల వివరాలు సేకరించండి



అలంపూర్: మండలంలో బడిబయటి పిల్లల వివరాలు సేకరించాలని ఎంఈఓ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమార్సీ భవనంలో మండలంలోని ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హాజరై మాట్లాడారు. మండలంలో 6-14, 14 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న బడిబయటి పిల్లల వివరాలు సేకరించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును, విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీఈఆర్ రిజిస్టర్ అప్డేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, బాలాజీ కృష్ణ కుమార్, శ్రీనివాసులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

నర్సరీల సందర్శన

మల్దకల్: మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న నర్సరీలలో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీఓ కృష్ణయ్య నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నాగర్‌దొడ్డి, తాటికుంట గ్రామాలలో ఉన్న నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం నాటికి నర్సరీలలో మొక్కలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మొక్కలకు తగినంత నీరు అందిస్తూ వాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సురేందర్‌రావుకు నివాళి



ధరూరు: మండలంలోని కోతులగిద్ద జాగీర్దార్ సురేందర్‌రావు 13వ వర్ధంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కోతులగిద్దలోని ఆయన విగ్రహానికి అర్చకులు, గ్రామస్తులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు కుర్వ రంగన్న, జీ రాములు, జాన్, కేబీ గోవిందు, ఎండీ హుమాయూన్, ఆంజనేయరెడ్డి, బీజేపీ తిమ్మప్ప, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్గనైజర్లతో రైతులు ఆగమాగం



ఏఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గట్టు: దళారులతో రైతులు మోసపోయి ఆగమాగం అవుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల ఉపాధ్యక్షుడు దయాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి తోహీద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కంపెనీలు నేరుగా రైతులకు ఫౌండేషన్ విత్తనాలు ఇవ్వకుండా మధ్యవర్తులు (ఆర్గనైజర్ల) ద్వారా రైతులతో విత్తనపత్తిని సాగు చేయిస్తూ, తిరిగి పంటను మధ్యవర్తుల ద్వారానే తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేష్, నాయకులు కొండన్న, ఉలిగెప్ప, వెంకటేష్, నర్సన్న పాల్గొన్నారు.

బూత్ కమిటీ సమ్మేళనానికి తరలిరండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో నిర్వహించనున్న పోలింగ్ బూత్ కమిటీ సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయం ఆవరణలో బూత్ కమిటీ సభ్యులు, పదాధికారుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. శనివారం జిల్లా కేంద్రంలో ఎస్‌వీ ఈవెంట్ హాల్లో నిర్వహించే బూత్ కమిటీల సమావేశానికి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించే పోలింగ్ బూత్ సభ్యుల సమ్మేళనానికి రాష్ట్ర నాయకుడు పాలక్ చింత సాంబమూర్తి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాధన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమ్‌సేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలుగా గుర్తించే వరకు పోరాటం



గ్రామ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ధరూరు: రజకులను ఎస్సీలుగా గుర్తించే వరకు పోరాడుతామని రజక సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, ఉప సర్పంచు సవారన్నలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రజక కమ్యూనిటీ హాల్‌లో రజక కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కట్టమీది తిమ్మన్న, అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షుడిగా గడ్డం పరుశ, ప్రధాన కార్యదర్శులుగా కారం రవి, బండి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా బుడ్డ శ్రీను, కోశాధికారిగా రంగేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పరుశ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న వేంకటేశ్వరరెడ్డి

ధరూరు/కేటీదొడ్డి: కర్నాటక బార్డర్‌లో ఉన్న మారుమూల గ్రామాలకు సాగు నీరందించి ఆ ప్రాంత రైతులను ఆదుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కేటీదొడ్డి యువ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. శుక్రవారం కేటీదొడ్డి, ధరూరు మండల కేంద్రాల్లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గద్వాల పట్టణంలోని ఎస్వీ ఈవెంట్ హాల్‌లో ఈ నెల 7న నిర్వహించే బూత్ కమిటీ సమావేశానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సంజీవ్ భరద్వాజ, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



అలంపూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



ఉండవెల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్కీం వర్కర్లు

అలంపూర్: స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ప్రకారం స్కీం వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుభాష్ నాయుడికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతమ్మ, సావిత్రి, శాంతమ్మ, పద్మావతి, ప్రమీల, శివలింగమ్మ, నాగేశ్వరమ్మ, ఇమాంబీ, లక్ష్మీదేవి, మాసుంబీ, పార్వతమ్మ తదితరులు ఉన్నారు.

గట్టు: మండల కేంద్రంలో స్కీం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ వీఓఏల మండల యూనియన్ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్, ఎంపీఓ మహేష్, ఐకేపీ ఏపీఎంలకు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వీఓఏల మండల అధ్యక్షుడు ప్రకాష్, వీరేష్, వీరన్న, సురేష్, రవిచంద్ర, వెంకటేష తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ వీరభద్రప్పకు అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు అనుసూయమ్మ, నాగేశ్వరమ్మ, అన్వేష, రాజేశ్వరి, కృష్ణ, మద్దిలేటి పాల్గొన్నారు.

మురుగుతో గ్రామస్తుల అవస్థలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

మల్దకల్: గ్రామాలలో మురుగుతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మండలంలోని బిజ్వారంలో పల్లెనిద్రలో భాగంగా శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు లేక మురుగునీరు నిలిచిపోయి దోమల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. గ్రామం నుంచి మల్దకల్‌కు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామంలోని సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకునే విధంగా కృషి చేస్తానని రంజిత్‌కుమార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు లవన్న, విష్ణు, ప్రేమ్‌రాజు, రంగస్వామి, కృష్ణ, రాముడు, కిష్టన్న, వెంకట్రాములు, పరమేష్, లక్ష్మన్న, తిమ్మన్నలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబండ గిరక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న స్నిగ్ధారెడ్డి

గట్టు: మండలంలోని సల్కాపురంలో గోకరమయ్య ఉర్సు సందర్భంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్నిగ్ధారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. మొదటి స్థానంలో సల్కాపురం తోలన్న, ద్వితీయ బహుమతి పెంచికలపాడు బుజ్జీ, తృతీయ స్థానంలో చాకలి ఈరప్పలు నిలిచి బహుమతులు దక్కించుకున్నారు. మొదటి బహుమతి రూ.5016, రెండో బహుమతి రూ.3016, మూడో బహుమతి రూ.2016లు అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రావు, జయసింహారెడ్డి, కోళాయి భాస్కర్, రాజప్ప, నాగప్ప, ఆంజనేయులు, బెల్లం నర్సింహులు, శంకరయ్య, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పట్టణం, ధరూరు మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో శుక్రవారం మెడికల్ షాప్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీలు పద్మావెంకటేశ్వరరెడ్డి, రాజశేఖర్, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ధరూరు: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద శుక్రవారం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవిప్రకాష్‌ల ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఎంఈఓ సురేష్ ఆవిష్కరించారు.

శాంతినగర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఎస్ఐ శ్రీనివాసులు, ఎంఈఓ నరసింహులు ఆవిష్కరించారు.

